క్లుప్తంగా

పదవీ విరమణ సహజం



డాక్టర్ సంజీవరావును సన్మానిస్తున్న వీసీ ఆచార్య ఎ.ఆనందరావు తదితరులు

కర్నూలు (న్యూసిటీ): ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి (వీసీ) ఆచార్య ఎ.ఆనందరావు అన్నారు. యూనివర్సిటీలో ఆర్థికశాస్త్రం ప్రొఫెసర్ డాక్టర్ సంజీవరావు బుధవారం పదవీ విరమణ చేయడంతో సెమినార్ హాలులో వీడ్కోలు సభ నిర్వహించారు. అతిథులు మాట్లాడుతూ ప్రొఫెసర్ సంజీవరావు వివిధ హోదాల్లో అందించిన సేవలను కొనియాడారు. తనకు సహకరించిన ప్రతిఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానంద్ పుచ్చా, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్‌టీకే నాయక్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.భరత్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పాట్ బిల్లింగ్ ప్రారంభించండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారీ విద్యుత్ బిల్లుల జారీ ప్రక్రియ స్పాట్ బిల్లింగ్‌ను గురువారం నుంచి ప్రారంభించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. బుధవారం ఆయన కిందిస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1 తేదీ నుంచి తప్పనిసరిగా స్పాట్ బిల్లింగ్ చేపట్టి, వినియోగదారులకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఇల్లు, షాపు వద్ద విద్యుత్ మీటర్ వద్దకు వెళ్లి డిజిటల్ స్కాన్ చేసి బిల్లింగ్ తీయాలన్నారు. మీటర్ల స్కానింగ్ కానిపక్షంలో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. దీనిపై మీటర్ రీడర్లకు ఏఈలు, ఏడీఈలు తగిన సూచనలు జారీ చేయాలని చెప్పారు.

నిబంధనల అతిక్రమణపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు రఫీ

కర్నూలు సిటీ: జిల్లాలో నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌ఎండీ రఫీ, నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు ప్రసంగించారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాం విక్రయిస్తున్నారన్నారు. విద్యాశాఖ ఆదేశాలను ఏ మాత్రం పట్టించుకోకుండా ఇంటింటికీ తిరుగుతూ అడ్మిషన్లు చేయిస్తున్నారన్నారు. రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్‌టీఈ) యాక్ట్ ప్రకారం ప్రతి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో ప్రాథమిక విద్య ప్రవేశాల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాల్సి ఉన్నా చాలా యాజమాన్యాలు అమలు చేయడం లేదన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి ఆయా విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం నాయకులు క్రాంతికుమార్, వేణు, ఉదయ్, రాజేష్, రవీంద్ర, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

3న ధార్మిక సంస్థల ప్రతినిధుల సమావేశం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని కోట ఆంజనేయ స్వామి ఆలయ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి రక్షించుకునేందుకు ఈనెల 3వ తేదీ ఉదయం 6.30 గంటలకు ధార్మిక సంస్థల ప్రతినిధులు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకుల సమావేశం ఏర్పాటు చేసినట్లు బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. హిందూ ఆలయాల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందులో భాగంగా కోట ఆంజనేయ స్వామి ఆలయ స్థలాన్ని స్వాధీనం చేసుకునే అంశంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: బిచ్చగాడు 2, 2018, స్పైడర్ మ్యాన్ : అక్రాస్ ది స్పైడర్ వర్స్, ఫాస్ట్ ఎక్స్, ది కేరళ స్టోరీ, మేమ్ ఫేమస్, ది లిటిల్ మర్మయిడ్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : స్పైడర్‌మ్యాన్ : అక్రాస్ ది స్పైడర్ వర్స్, బిచ్చగాడు 2, మేమ్ ఫేమస్, విరుపాక్ష
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: బిచ్చగాడు 2, విరుపాక్ష
ఐనాక్స్ : స్పైడర్‌మ్యాన్ : అక్రాస్ ది స్పైడర్ వర్స్, ఫాస్ట్ ఎక్స్, 2018, మేమ్ ఫేమస్, ది కేరళ స్టోరీ
భరత్ కాంప్లెక్స్ : ఫాస్ట్ ఎక్స్, కస్టడీ, విరుపాక్ష
శ్రీరామ : మోసగాళ్లకు మోసగాడు
రాజ్ : మళ్లీ పెళ్లి
విజయ : బిచ్చగాడు 2

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



శరీన్ నగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలతో పాటు చెప్పని వాటిని కూడా ప్రజలకు అందిస్తున్నామన్నారు పార్టీలు, మతాలు, కులాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డ్రైనేజీ కాలువలు, రోడ్లు, కల్వర్టులు వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ జయరాముడు, జెసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు పెద్దన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించే వరకు పోరాటం



ఢిల్లీలో చేపట్టిన సంకల్పదీక్షలో సంఘీభావం తెలుపుతున్న వీఆర్‌పీఎస్ నేతలు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి/బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసి పంపిన బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం లభించే వరకు పోరాటాలను కొనసాగిస్తామని వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఈ మేరకు బుధవారం రాయలసీమ జిల్లాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వాల్మీకి నేతలతో కలిసి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సంకల్పదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో వాల్మీకుల ఎస్టీ బిల్లును ఆమోదించి చట్టబద్ధత కల్పించాలన్నారు. గత ఎన్నికలకు ముందు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కర్నూలు బహిరంగ సభలో వాల్మీకులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. ఢిల్లీ వాల్మీకి నేత, వీఆర్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవీందర్‌చౌదరి, జాతీయ మహిళా నాయకురా లు ప్రియాంకచౌదరి మాట్లాడుతూ.. ఏపీలోని వాల్మీకులు చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా దేశవ్యాప్తంగా వాల్మీకులను సమీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు చెందిన నాయకులు అమిత్, కమల్, కుల్దీప్, విశాల్, సుమన్, దేవి, అనూప్, రాష్ట్ర వీఆర్‌పీఎస్ నాయకులు జీ.రాంభీంనాయుడు, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, నరేంద్ర, మురళీనాయుడు, ఖాశీంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎన్నికల పరిశీలకులు

కర్నూలు(రూరల్): కర్నూలు జిల్లా అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు నాగేశ్వరరావు, ఒలింపిక్ అసోసియేషన్ నాయకులు రామాంజనేయులు తెలిపారు. బుధవారం టెలికాం నగర్‌లో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు.అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె.విక్టర్, ప్రధాన కార్యదర్శిగా సుబ్బరత్నాలు, కోశాధికారిగా మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా లక్ష్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాసులుతో పాటు మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి అథ్లెటిక్స్ సంఘం మాజీ కార్యదర్శి హర్షవర్ధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న ఆలూరు పోలీసులు

ఆలూరు రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 1,152 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారు జామున 4 గంటలకు ఆలూరులోని కస్తూర్బా పాఠశాల సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. మొలగవల్లి గ్రామానికి చెందిన గోవిందు, నరసింహులు స్కూటర్లపై అక్రమంగా తరలిస్తున్న 12 బాక్సుల కర్ణాటక మద్యం (1,152 ఒరిజినల్ ఛాయిస్ 90 ఎంఎల్) స్వాధీనం చేసుకుని స్కూటర్‌లను సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఆలూరు ఎస్ఐ డాక్టర్ నాయక్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక వికాసానికి వేదికగా వేసవి శిబిరాలు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు కల్చరల్: మానసిక వికాసానికి వేసవి శిక్షణ శిబిరాలు వేదికలుగా నిలుస్తున్నాయని ఫుడ్ కార్పొరేషన్ విశ్రాంత మేనేజర్ చంద్రశేఖరప్ప అన్నారు. బుధవారం సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో టీజీవీ కల్చరల్ అకాడమీ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో శాస్త్రీయ సంగీతం, నృత్యం, పాశ్చాత్య నృత్యం, చిత్రలేఖనం వంటి అంశాల్లో చిన్నారులకు శిక్షణ ఇచ్చి ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నెల రోజుల పాటు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముగింపు రోజున విద్యార్థులు శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను ప్రదర్శిస్తారన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. శిక్షకులు నాగరాజు, సుజాత, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో క్యాన్సర్ ముప్పు



పొగాకు నిర్మూలన ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కర్నూలు (హాస్పిటల్): పొగతాగే వారికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభించారు. కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ఆశా కార్యకర్తలతో కలిసి పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాల గురించి ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. సరదగా మొదలయ్యే సిగరెట్/బీడీ అలవాటు తర్వాత చెడ్డ వ్యసనంగా మారి ప్రాణాలు తీస్తోందన్నారు. పొగతాగడం వల్ల వచ్చే క్యాన్సర్ తదితర ప్రమాదకర వ్యాధులు వస్తాయన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్ మాట్లాడుతూ పొగ తాగడం వల్ల నోటి దుర్వాసన, గొంతు వ్యాధులు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, కఫం, దగ్గు, ఆయాసం, రక్తపోటు, క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దంత విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ భవాని, వైద్యులు పాల్, సౌందర్య, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధూమపానంతో దీర్ఘకాలిక వ్యాధులు

కర్నూలు(హాస్పిటల్): ధూమపానం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని లయన్స్ జిల్లా గవర్నర్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు, ఆస్తమా, గమ్ ఇన్‌ఫెక్షన్, గుండె సంబంధిత వ్యాధులు, గొంతు క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం పొగాకు ఉత్పత్తులను సేవించడం వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. క్లబ్ అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, కార్యదర్శి సి.గోవర్ధన్‌గిరి పాల్గొన్నారు.

ముందుగా ఆసుపత్రిలో చేరితే సుఖప్రసవం



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ప్రమాదకర చిహ్నాలున్న గర్భిణులను మూడు రోజులు ముందుగానే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేర్పిస్తే సుఖప్రసవం చేసేలా చర్యలు తీసుకుంటారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. ఆయన బుధవారం స్థానిక రోజా వీధిలోని యుపీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భవతులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గర్భవతుల పేర్లను 12 వారాల్లోపు నమోదు చేసి సమయానుసారంగా ఆరోగ్య సేవలు అందించాలని, వారు కాన్పునకు వెళ్లే ఆస్పత్రిని ముందుగానే గుర్తించి వివరాలను ఏఎన్ఎం యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఏఎన్ఎం రోజుకు కనీసం 10 హెల్త్ ఐడీలు జనరేట్ చేయాలని చెప్పారు. మాతా శిశు సంరక్షణ కార్డు, వ్యాధి నిరోధక టీకాలు, ఆసుపత్రి కాన్పులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్, కర్నూలు మేయర్ బీవై రామయ్య తదితరులు

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన పేద, మధ్య తరగతి ప్రజలకు అందించడంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం స్థానిక నగర పాలక సంస్థ సమావేశ భవనంలో 38, 39, 40 వార్డుల వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ వలంటీర్ల సేవలను కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వలంటీర్లపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని వారికి సూచించారు. ఆయా వార్డులోని మొత్తం 130 వలంటీర్లను సేవామిత్ర, ఒకరిని సేవారత్న పురస్కారాలతో సత్కరించి, శాలువా, మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, టౌన్ ప్రాజెక్టు అధికారి వెంకటలక్ష్మి, మెప్మా సూపరింటెండెంట్ మన్సూర్, కార్పొరేటర్లు సాంబ, విక్రమసింహారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

4న సంతాప సభ

కర్నూలు కల్చరల్: ప్రగతి శీల సాహిత్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సంతాప సభ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సభ జరుగుతుందని పేర్కొన్నారు. సాహితీవేత్తలు వెంకటకృష్ణ, డాక్టర్ హరికృష్ణ, బండారి రాజేష్, పాణి, ఇనాయతుల్లా వక్తలుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రశ్నాపత్రాలు



పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నాపత్రాలను భద్రపరుస్తున్న పరీక్షల అధికారులు

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, మౌంట్ కార్మెల్ పాఠశాలలో ఈనెల 2 నుంచి 10వ తేదీ వరకు జరిగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అంతా సిద్ధం చేసినట్లు ఆయా పరీక్షల చీఫ్ శోభరాణి, లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ప్రశ్నాపత్రాలను కోసిగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా పోలీసుల సమక్షంలో భద్రపరిచారు. వారు మాట్లాడుతూ 10వ తరగతి ఫెయిల్ అయినా విద్యార్థులు బాలుర ఉన్నత పాఠశాలలో 300 మంది, మౌంట్ కార్మెల్ పాఠశాలలో 300 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు 9గంటల లోపు పరీక్ష కేంద్రం చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఆయా పాఠశాల డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా రామాంజనేయ రెడ్డి, సిద్ధప్పను నియమించారు.

యువతి ఆత్మహత్య

ఆదోని అర్బన్: కడుపునొప్పి తాళలేక యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. హొస్పేటకు చెందిన వెంకటేశ్వర్లు, సుజాత దంపతుల కుమార్తె సంధ్య (16). ఆమె తల్లితో కలిసి ఆదోని, ఇందిరానగర్‌లోని అమ్మమ్మ ఇంట్లో ఉంటోంది. కొద్ది రోజులుగా సంధ్య కడుపునొప్పితో బాధపడుతోంది. జీవితంపై విరక్తిచెంది ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తుచేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు పేర్కొన్నారు.

తైక్వాండో క్రీడలో రాణించాలి

కర్నూలు (రూరల్): విద్యార్థులు తైక్వాండో క్రీడలో రాణించాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ వాసు రెడ్డి సూచించారు. బుధవారం నగరంలోని పెద్ద మార్కెట్ వద్ద కింగ్ పార్క్‌లో తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. విద్యార్థులు రోజూ సాధన చేయడం ద్వారా మెలకువలు నేర్చుకోవచ్చని, క్రీడల వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. శిక్షణ మాస్టర్ వెంకటేశ్వర్లు, సీనియర్ క్రీడాకారిణి ఉర్మిళ పాల్గొన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ జాషువా

కర్నూలు (టౌన్): క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ ఆడిపి జాషువా అన్నారు. బుధవారం నగర శివారులోని జీవసుధ హాలులో క్రైస్తవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మైనార్టీ వర్గాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. త్వరలోనే క్రైస్తవులకు ఇళ్ల స్థలాలు, చర్చిలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి పాస్టర్‌కు గౌరవ వేతనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్రైస్తవులకు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీ రూపంలో ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం క్రైస్తవ ఐక్య వేదిక నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు దైవ సందేశకులు డాక్టర్ గోవింద్ సత్యశీలన్, క్రిస్టియన్ హక్కుల పోరాట నాయకులు జానయ్య, క్రైస్తవ సంఘం నాయకులు సునీల్, జయకాంత్, ప్రభుదాస్, జాన్ విల్సన్ పాల్ పాల్గొన్నారు.



కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ఆర్టీసీ బస్టాండ్‌లో రద్దీ



కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు కొత్త బస్టాండ్ ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడింది. వేసవి సెలవులు, వివాహాలు ఉండడంతో ప్రయాణాలు పెరిగాయి. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండడంతో బుధవారం బస్ స్టేషన్ కిక్కిరిసింది. తగినన్ని బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు బస్టాండ్‌లో అవస్థలు పడ్డారు. నంద్యాల, ఆత్మకూరు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, బనగానపల్లె, నంద్యాల, అనంతపురం సెక్టార్ల వైపు వెళ్లే బస్సుల్లో నిల్చునేందుకు కూడా స్థలం లేకపోయింది.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ కె.వేణుగోపాల్

కర్నూలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన బడి నాడు-నేడు రెండో విడత పనులు ఈ నెల 5వ తేదీకల్లా పూర్తి చేయాలని సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ ఆదేశించారు. ఆయన బుధవారం సమగ్ర శిక్ష కార్యాలయంలో.. నాడు-నేడు పనుల పురోగతిపై మండల విద్యాధికారులు, ఇంజినీర్లతో సమీక్షా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆయా పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల మరమ్మతులు, టాయిలెట్ల మరమ్మతులు, కిచెన్ షెడ్ల నిర్మాణ పనులను 5వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. ఎలక్ట్రిఫికేషన్ 7వ తేదీ, తాగునీటి పనులు 10వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు వెనకబడిన చోట అదనపు కూలీలను నియమించుకోవాలని, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, బడుల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. నిధులు తక్కువైతే మండలస్థాయిలో అత్యధికంగా నిధులు విడుదలైన పాఠశాల నుంచి బదిలీ ఎంట్రీ ఆర్డర్ ద్వారా సమకూర్చుకోవాలని ఎంఈఓలకు సూచించారు. కల్లూరు, కర్నూలు, కోడుమూరు మండలాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డుల సహాయంతో బోధన కొరకు అవసరమైన ఆధునిక పరికరాలు వచ్చాయని, వాటిని సంబంధిత ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో అవసరమైన చోట ఏర్పాటు చేసుకోవాలని, వాటి ఇన్‌స్టాలేషన్ చేసేందుకు వచ్చిన టెక్నీషియన్‌లకు సహకరించాలన్నారు. సమగ్ర శిక్ష ఈఈ కర్రెన్న, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ లక్ష్మీనారాయణ, ఆదోని మున్సిపల్ ఇంజినీర్లు ఈఈ నాగభూషణం రెడ్డి ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.